క్లుప్తంగా

6న దుకాణం లీజుకు బహిరంగ వేలం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):నగరంలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం) ఆవరణను అనుకొని ఉన్న ఉన్న ఆరో నెంబర్ దుకాణం అద్దెకు సంబంధించి ఈ నెల ఆరో తేదీన టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి హేమలతాదేవి తెలిపారు. టెండరుదారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, టిన్ నెంబర్, పాన్ నెంబర్, వస్తు సేవల పన్ను ఖాతా నెంబర్ కలిగిన కార్డు నకళ్ళను దేవస్థానము కార్యాలయంలో సమర్పించి టెండర్ దరవాతు చెల్లించాలని సూచించారు. ఆలయ కార్యాలయంలో టెండర్ షెడ్యూల్‌కు ఐదు వందలు చెల్లించి పొందగలరని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం ఆలయ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

క్రమశిక్షణతోనే విజయావకాశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నప్పుడే విజయావకాశాలు సొంతమవుతాయని విజయవాడ చిల్డ్రన్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దేవినేని కిషోర్ కుమార్ అన్నారు. సెయింట్ థామస్ హైస్కూల్ 22వ వార్షికోత్సవం కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కిషోర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలపై పట్టు సంపాదించాలన్నారు. మరో ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ప్రముఖ సైకాలజిస్ట్ ప్రియ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలన్నారు. రిటైర్డ్ హెడ్మాస్టర్ కాలే ప్రకాష్‌రావు అసోసియేషన్ వన్‌టౌన్ నాయకులు శిరీష కుమారి, ఖాదర్‌బాషా, పుప్పాల శ్రీనివాసరావు, జిలానీ, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు డేవిడ్ దొంతులూరి నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వాస్పత్రిలో ఉచిత భోజనం

లబ్బీపేట(విజయవాడతూర్పు): కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో రోగుల అటెండెంట్స్, అవుట్‌పేషెంట్స్‌కు ఉచిత భోజన పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. హరే కృష్ణ మూమెంట్ ఇండియా ద్వారా రోజుకు వంద మందికి చొప్పున నెల రోజుల పాటు ఉచిత భోజన ం అందచేస్తామని ఫౌండేషన్ మాజీ అధ్యక్షుడు పీఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కోనేరు వెంకట రామారావు, కార్యదర్శి కుర్రా సాయిరాం, ఉపాధ్యక్షుడు మేరుగ అక్కయ్యానాయుడు, మాలపాటి కోటిరెడ్డి, కోనేరు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. లారీ ఓనర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకుల్లో రోజుకు వెయ్యి మజ్జిగ ప్యాకెట్ల చొప్పున, 40 రోజుల పాటు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించినట్లు అధ్యక్ష కార్యదర్శులు కోనేరు వెంకట రామారావు, కుర్రా సాయిరాం తెలిపారు.

మధురంగా త్యాగరాజ స్వామి కీర్తనలు



విజయవాడ కల్చరల్: సద్గురు త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా దుర్గాపురంలోని శ్రవణ సదనంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి సంగీత మహోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. సోమవారం నాటి కార్యక్రమంలో త్యాగరాజ స్వామి రచించి స్వరపరచిన కీర్తనలు మధురంగా ఆలపించారు. ఏలా నీదయ రాదు, మరుగేలరా ఓరాఘవా, ఆడమోడిగలదా, బ్రోవభారమా, బాగెయ్యనయ్య, సరస సామదాన తదితర కీర్తనలు ఆలపించారు. సంగీత విద్వన్‌మణి కస్తూరి గోపాలరావు, చిన్నారులు లహరి, అమృత, హాసిని, తేజశ్రీ, సంహిత, కమలిని, మృత్తిక, మాయ, శౌరీ, కే శ్రావ్య శివానీ, జీ తీర్థ ప్రియాంజలి, ఎస్. కల్యాణి, కుందుర్తి మాధవి, ఎం.శృతిరంజని కల్లూరి శ్రీనివాస్, మల్లాది సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్వ్యూకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యంపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... భవానీపురం లలితానగర్‌కు చెందిన మానసకు వివాహం జరిగింది. గత కొంత కాలంగా భర్తతో విడిపోయి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. యువతి అమ్మమ్మ వాళ్ల ఊరికి చెందిన రాము అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. తల్లిదండ్రులకు విషయం తెలిసి మందలించగా ఇకపై అతనితో మాట్లాడనని చెప్పింది. సోమవారం ఐసీఐసీఐ అకాడమీలో ఇంటర్వ్యూకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో తల్లి ఫోన్ చేసి అడిగింది. తాను మార్గమధ్యంలో ఉన్నానని మానసా తల్లిదండ్రులకు చెప్పింది. కొంత సేపటి తర్వాత రాము అనే వ్యక్తి ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ అమ్మాయిని ప్రేమిస్తున్నాని వెళ్లిపోతున్నామని చెప్పి ఫోన్ స్విచాఫ్ చేశాడు. యువతి తండ్రి లంక వెంకట రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జగనన్న కార్మికుల పక్షపాతి

మేడే వేడుకల్లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



పార్టీ జిల్లా కార్యాలయం వద్ద మేడే జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ కార్మికులకు అండగా ఉంటుందని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ నగర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు విశ్వనాథ రవి, వెలది అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలు నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. తొలుత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ కార్మికుల పక్షపాతి అని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం అమలు చేస్తున్నామన్నారు. కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. అనంతరం జగనన్నే మా నమ్మకం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆటోలకు స్వయంగా అతికించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు మహదేవ్ అప్పాజీ, కోటి రెడ్డి, మరుపిళ్ళ రాజేష్, మైలవరపు మాధురి లావణ్య, మైలవరపు దుర్గారావు, కొనకళ్ళ విద్యాధర రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు డైరక్టర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు

కార్మికులకు అండగా జగన్ ప్రభుత్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):రాష్ట్రంలో కార్మికవర్గానికి అండగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. పంజా సెంటర్‌లో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అనుబంధంగా ఉన్న ఆటో స్టాండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకల్లో భాగంగా పార్టీ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ ఆసిఫ్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కార్మికులకు మిఠాయిలను పంచిపెట్టారు. షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. కార్మికుల అభ్యున్నతి కోసం సైతం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా ప్రజల జీవన ప్రమణాల మెరుగుపరిచేందుకు జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని వివరించారు. ఆయనకు అందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అహ్మద్, గాంధీ, కాజా, వలీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అభ్యున్నతికి కృషి మేయర్ భాగ్యలక్ష్మి

కార్మికుల అభ్యున్నతికి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. కెనాల్‌రోడ్డులోని గూడ్స్ ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ అనుబంధం) ఆధ్వర్యంలో మేడేని పురస్కరించుకొని స్థానికంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మేయర్ భాగ్యలక్ష్మీ ప్రారంభించారు. అలాగే డ్రైవర్లకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్మిక వర్గానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమాన్ని ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షులు విశ్వనాథ రవి నిర్వహించగా నాయకులు కరిముల్లా, ఖాన్, వెంకట్రావు, సుబ్బారావు, సుబ్బారెడ్డి, నారాయణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమ జీవుల సంఘటిత శక్తికి ప్రతీక మే డే

భవానీపురం(విజయవాడపశ్చిమ):కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పలు ప్రాంతాల్లో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాధరపురం చెరువు సెంటర్ 45వ డివిజన్‌లోగల సీపీఐ కార్యాలయం ఉప్పలపాటి సుబ్బరాజు భవన్ వద్ద నగర కార్యదర్శివర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ జెండా ఆవిష్కరించి రెడ్ శాల్యూట్ చేశారు. ఆమె మాట్లాడుతూ శ్రమ జీవుల సంఘటిత శక్తికి మే డే ప్రతీకగా నిలుస్తుందన్నారు. డివిజన్ సహాయ కార్యదర్శులు యరసాని జోసఫ్, అంజూరి సూరిబాబు, స్థానిక నాయకులు పిచ్చయ్య, రాంబాబు, సుబ్బారెడ్డి, ఏవీ రంగారావు, దేవరాజ్, శివ, పీ విజయ్ తదితరులు పాల్గొన్నారు. సీతారామాంజనేయ లారీ వర్క్స్ కమ్మరం మేస్త్రి భోగిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో సీపీఎం నాయకులు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. మెకానిక్స్ ఎస్‌డీ రఫీ, నాగేశ్వరరావు, అహ్మద్, నాగరాజు, చిన్నా మేస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక దినోత్సవం సందర్భంగా విద్యాధరపురం కబేళా సెంటర్‌కు చెందిన వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవానీపురంలోని ఐరన్ యార్డ్‌లోని ముఠా కార్మికులు, ఆటో డ్రైవర్స్, వీఎమ్‌సీ పారిశుద్ధ్య కార్మికులకు ఎర్ర కండువాలు పంపిణీ చేశారు. అలాగే చిట్టినగర్ కలరా హాస్పటల్ సిబ్బందికి కూడా కండువాలు అందచేశారు. మహేష్ బాబా సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాయిబాబా గుడి వెంకటేష్, ట్రస్ట్ చైర్మన్ దుర్గా కిషోర్, సభ్యులు దుర్గాప్రసాద్, లక్ష్మీ శ్రీనివాస్, సేవకులు పాల్గొన్నారు.



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్



యూనిఫామ్‌లను పంపిణీ చేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి



చెరువు సెంటర్‌లో పార్టీ జెండా ఎగురవేసి శాల్యూట్ చేస్తున్న దుర్గాంబ, పార్టీ నాయకులు

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ):ప్రతి నెలా ఫస్ట్ తారీకు వచ్చిందంటే ఠంచన్‌గా వలంటీర్లే ఇంటికే వచ్చి పింఛన్లు ఇస్తారన్న నమ్మకం అవ్వాతాతల్లో నెలకొంది. ప్రతి నెలా మాదిరిగానే ఈ నెల మొదటి రోజు సోమవారం వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందచేశారు. ఈ క్రమంలో చిట్టినగర్ 47వ డివిజన్ 147వ సచివాలయ కన్వీనర్లు దేరంగుల రమణ, ఇలిపిళ్ల విజయలక్ష్మి, మద్దిరాల కమలాకర్ పర్యవేక్షణలో సీ-ల, సీ-2 క్లస్టర్స్ వాలంటీర్లు, గృహసారథులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఇటీవల హార్ట్ సర్జరీ చేయించుకుని బెడ్‌పై ఉన్న దివ్యాంగుడు పొట్నూరి సునీల్ కుమార్ ఇంటికి వెళ్లి పింఛన్ అందచేశారు. కార్యక్రమంలో బి.రాజేంద్రప్రసాద్, ఎం.నాగేంద్ర పాల్గొన్నారు. అలాగే 38వ డివిజన్ కుమ్మరిపాలెం సెంటర్‌లోని 194వ సచివాలయ పరిధిలో కన్వీనర్ షేక్ నజీర్, గృహసారథి రామనాధం రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో వాలంటీర్లు లక్ష్మీ రేవతి, దుర్గలు పింఛన్లు అందచేశారు. 43వ డివిజన్ పరిధిలోని భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీ సీ-14 క్లస్టర్ హెచ్‌ఐజీ బ్లాకుల్లో నివసించే అవ్వాతాతలకు వలంటీర్ వీణా భవానీ పింఛన్లు పంపిణీ చేశారు.

స్టెనోగ్రఫీ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టెనోగ్రఫీ సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యాన మొట్టమొదటిసారిగా స్టెనోగ్రఫీ కోర్సు ప్రారంభించామన్నారు. ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న స్టెనోగ్రఫీ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరింత సమాచారం కోసం కళాశాలలో స్వయంగా కానీ 7032867645 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గడువులోగా స్పందన సమస్యలకు పరిష్కారం




అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో నెల కొన్న సమస్యలను అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించాలని, నగరవాసుల సంతృప్తే లక్ష్యంగా విధులు నిర్వహించాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలన్నీ నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సూచించారు. అర్జీదారుని సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని కోరారు. గత వారం స్పందనలో వచ్చిన సమస్యల పరిష్కారంపై కమిషనర్ అధికారులతో సమీక్షించారు. ప్రధానంగా వచ్చిన 10 సమస్యల్లో తాగునీటి సరఫరా, డ్రైనేజీలో మురుగునీటి పారుదలపై అధికంగా ఫిర్యాదులు రాగా వీటన్నింటినీ అధికారులు త్వరిగ తగిన పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు.

ఈ నెల 9న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ప్రారంభించనున్న 'జగనన్న కు చెబుదాం ' కార్యక్రమంపై ఇప్పటికే తమ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను 1902 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసిన వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. స్పందన కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం – 5, పట్టణ ప్రణాళిక విభాగం – 3, రెవెన్యూ – 1, పట్టణ సాధికారాభివృద్ధి విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)– 1 విభాగాలకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకర రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, వీఏఎస్ డాక్టర్ రవిచంద్, ఏ.డి.హెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు స్పందన కార్యక్రమం నిర్వహించగా మొత్తం మూడు అర్జీలు వచ్చాయి. సత్యనారాయణపురంలోని సర్కిల్ – 2 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం – 1, రెవిన్యూ – 1 అర్జీలు, పటమటలోని సర్కిల్ – 3 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం – 1 అర్జీ రాగా చిట్టినగర్‌లోని సర్కిల్ – 1 కార్యాలయంలో ఎటువంటి అర్జీలు రాలేదని జోనల్ కమిషనర్లు తెలిపారు.

కాపులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

- ఆకుల శ్రీనివాస్ కుమార్ డిమాండ్
- రైల్వే కోర్ట్ తీర్పుపై హర్షం



భవానీపురం(విజయవాడపశ్చిమ): తుని కేసులో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంతోపాటు సుమారు 40 మంది కాపు నాయకులను నిర్దోషులుగా ప్రకటిస్తూ విజయవాడ రైల్వే కోర్ట్ తీర్పు రావడంపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు, కాపు సామాజికవర్గ నేత ఆకుల శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు గతంలో ఎన్నికల సందర్భంగా కాపులకు బీసీ హోదా కల్పించి వారికి విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్స్ కల్పిస్తానని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ముద్రగడ పద్మనాభం 2016 జనవరిలో తునిలో నిర్వహించిన 'కాపు గర్జన' బహిరంగ సభ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులపై టీడీపీ ప్రభుత్వం పెట్టిన 175 కేసులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా కేసులను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమేనని పేర్కొన్నారు. అయితే సభకు వచ్చిన వారికి సంబంధం లేకపోయినా రైలు దహనం చేసినట్లు అనేక మంది కాపులపై కేసులు పెట్టి ఉగ్రవాదులుగా చిత్రీకరించడానికి చంద్రబాబు అనేక ప్రయత్నాలు చేశాడని తెలిపారు. చంద్రబాబు ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని ఎన్ని రకాలుగా వేదించినా చివరకు న్యాయస్థానంలో అతని కుట్రలు నిలువలేక పోయాయని పేర్కొన్నారు. ఈ తీర్పు చూసి ఇప్పటికైనా చంద్రబాబు కళ్లు తెరిచి కాపులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నిబంధనల ప్రకారం నడుచుకోవాలి



ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న వన్‌టౌన్ పీఎస్ సీఐ సురేష్‌రెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):నగరంలో ఆటోలు నడిపే కార్మికులు తప్పనిసరిగా నిబంధనల ప్రకారం నడుచుకోవాలని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సీఐ సురేష్‌రెడ్డి అన్నారు. ఆటో కార్మికులతో అవగాహన కార్యక్రమాన్ని స్టేషన్ ప్రాంగణంలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆటో నడిపే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా లైసెన్స్, ఆటోకు సంబంధించిన అన్ని రికార్డ్స్ కలిగి ఉండాలన్నారు. వాహనాన్ని నడిపే సమయంలో తప్పనిసరిగా యునిఫాం ధరించి ఉండాలని, డ్రైవర్ పక్కన ఎవరినీ కూర్చోనివ్వకుండా చూడాలని చెప్పారు. ఆటో నెంబర్ ప్లేట్ కనిపించే విధంగా చూసుకోవాలని, ప్రయాణికులతో మర్యాదతో మాట్లాడాలన్నారు. ఆటోలో ఎవరైనా ఏదైనా మరిచిపోయిన యెడల విధిగా ఆ వస్తువులను సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలన్నారు. ఆటోను లైసెన్స్ లేని వారికి, తెలియని వారికీ అద్దెకు ఇవ్వవద్దన్నారు. స్టాండ్‌లలో ఏ విధమైన నేరము జరిగిన లేదా ఏదైనా కొట్లాట జరిగినా సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. ఆటోలను ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా ఎక్కడపడితే అక్కడ ఆపరాదని, పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలన్నారు. మద్యం సేవించి ఆటో నడపినా, అతి వేగంగా నడిపినా చర్యలు తప్పవన్నారు. సమావేశంలో పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలు జీ శంకరరావు, కే రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):రైల్వే స్టేషన్ వెస్ట్ బుకింగ్ సమీపంలోని స్టాండ్‌లలో నిలిపి ఉంచే ఆటోడ్రైవర్లకు సోమవారం కొత్తపేట పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ సుబ్రహ్మణ్యం ఆటోడ్రైవర్లకు పలు సూచనలు ఇచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసే మహిళా ప్రయాణికుల పట్ల డ్రైవర్లు మర్యాద పూర్వకంగా మెలగాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళ ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి విచ్చేసే మహిళలను సురక్షితంగా వారి ఇళ్ల వద్ద దింపాలని చెప్పారు. ఆటోలకు సంబంధించి అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, అదే విధంగా ఆటో యజమానులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్సు ఉన్న డ్రైవర్లకు మాత్రమే ఆటోలను అద్దెకు ఇవ్వాలని తెలిపారు. లైసెన్సు లేని డ్రైవర్లకు ఆటోలను అద్దెకు ఇచ్చినట్లయితే వారు ప్రమాదం జరిగితే యజమాని బాధ్యత వహించాలన్నారు. ప్రయాణికులు ఆటోలలో ఏమైనా సామగ్రి, వస్తువులను మర్చిపోయినట్లయితే వాటిని వెంటనే పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని పేర్కొన్నారు. సెక్టార్ ఎస్ఐ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి సీఐ అబ్దుల్ సలాం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆటో డ్రైవర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని భవానిపురం పోలీసు స్టేషన్ సీఐ అబ్దుల్ సలాం అన్నారు. సోమవారం స్టేషన్‌లో ఆటోయూనియన్ ప్రెసిడెంట్లు, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు మంచి నడవడికి కలిగి ఉండాలన్నారు. సామాజిక బాధ్యత ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని సూచించారు. సమావేశంలో ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..



ఫుడ్ ఫెస్టివల్‌లో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఫుడ్ ఫెస్టివల్ వేదికపై డాన్స్ చేస్తున్న యువత

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక పున్నమి ఘాట్‌లో నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన రివర్ ఫ్రంట్ ఫుడ్ ఫెస్టివల్‌కు విశేష స్పందన లభిస్తోంది. కృష్ణానదీ తీరాన ఆహ్లాదకరమైన వాతావరణంలో మొట్టమొదటి సారిగా 'ఫ్లేవర్స్ ఆఫ్ ఇండియ' థీమ్‌తో రూపొందించిన ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రజలు, ఆహార ప్రియులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సోమవారం సాయంత్రం నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించారు. స్టాల్స్ అన్నీ తిరిగి ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఈ ఫుడ్ ఫెస్టివల్ కేవలం ఆహార పదార్థాల కోసమే కాకుండా వినోదాన్ని అందించే వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో సేద తీరవచ్చన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉండే ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో నగరంలోని పెద్ద స్టార్ హోటల్స్ భాగస్వామ్యం కావడం హర్షణీయమన్నారు. అలాగే వెజ్ లేదా నాన్ వెజ్‌తో కూడిన మిల్లెట్ దోసె వంటి వినూత్న కాంబినేషన్‌లను అందిస్తున్నారని తెలిపారు. ఇక వినోదం విషయానికి వస్తే జబర్దస్త్ టీమ్ కామెడీ స్కిట్స్, డాన్స్‌లు, కిడ్స్ ర్యాంప్ వాక్, వైకుంఠపాళి, ఇతర సంగీత కార్యక్రమాలు కూడా అలరిస్తాయన్నారు.

రేపు రౌండ్‌టేబుల్ సమావేశం

కృష్ణలంక(విజయవాడతూర్పు):కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీఆర్‌టీ పాఠ్యాంశాల నుంచి డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని, చరిత్ర పాఠ్యాంశాలలో చేస్తున్న అహేతుకమైన మార్పులపై ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఈ నెల 3వ తేదీ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు టి.క్రాంతి కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ హిస్టరీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొవ్వా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పాల్గొంటారని చెప్పారు. ఎస్ఆర్ఆర్ కళాశాల చరిత్ర అధిపతి డాక్టర్ అజయ్‌బాబు, స్టెల్లా కళాశాల విశ్రాంత చరిత్ర విభాగ అధిపతి వెంకటరమణ, లయోలా కళాశాల విశ్రాంత చరిత్ర విభాగ అధిపతి రవీంద్రరాజు, రాజనీతి శాస్త్రం అధిపతి డాక్టర్ శామ్యూల్ దయాకర్, ప్రజాసంఘాల నాయకులు, విద్యావేత్తలు, సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

కనులపండువగా కల్యాణోత్సవం



వేదికపై పద్మావతి, వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం



అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు, ఉభయదాతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో గత 27వ తేదీ నుంచి సహస్ర చండీయాగం వైభవంగా జరుగుతోంది. పద్మావతి, శ్రీనివాసుల కల్యాణోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. పీఠం పీఠాధిపతి కరుమారి దాసు ఆధ్వర్యంలో ప్రధాన యాగశాలలో చండీయాగం చేశారు. 80 మంది రుత్వికుల మధ్య యాగం సాగింది. యాగశాల ఆవరణలోని వేదికపై అర్చకులు పద్మావతి శ్రీనివాసుల కల్యాణోత్సవాన్ని నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, నగర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. మరో వేదికపై అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

కరుమారి అమ్మన్‌ను నగర ఏడీసీపీ క్రైం వెంకట రత్నం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఏడీసీపీని ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. శ్రీశైలంలో వాసవీ సత్ర సముదాయాల అధ్యక్షుడు దేవిక వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు సూర్య వేణుగోపాలకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు.

స్వర రాగ సమ్మేళనం భారతీయ సంగీతం



విజయవాడ కల్చరల్:శృతి స్వర రాగ సమ్మేళనం భారతీయ సంగీతమని జ్యోతిష్య శాస్త్ర పండితులు రాణి నరసింహమూర్తి అన్నారు. స్వరలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆవిర్భావసభ, లోగో ఆవిష్కరణ, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్న సోమవారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భారతీయ సంగీతం నిత్యం ప్రవహించే సజీవ నదిగా అభివర్ణించారు. మెంబర్ ఆఫ్ ఏపీ బార్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ సకల కళావేదిక బెజవాడని సంగీత, సాహిత్య, రాజకీయ చైతన్యాలకు నిలయమన్నారు. స్వరలయ కార్యదర్శి ఎస్ఆర్ ప్రభాకర్ సంస్థ లక్ష్యాలను వివరించారు. అధ్యక్షుడు సంస్థ నిర్వహిస్తున్న తొలి కార్యక్రమం విఖ్యాత సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావుతో ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. పీవీ రమణ, బాల కామేశ్వరరావు, వైఎస్ రామకృష్ణ, శాంతిశ్రీ, ఇందునయన, భారతి, కల్యాణ శిరీషా పెండ్యాల స్వరపరచిన మధుర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.